కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ షేక్‌పేట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆమీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులు ఉన్నారు.

సుల్తాన్‌బజార్ ఏసీపీగా బాధ్యతల స్వీకరణ



ఏసీపీ మట్టయ్య

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీగా మైనం మట్టయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఏసీపీ శంకర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సూర్యపేట నుంచి మట్టయ్య బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

నాలా పనులు త్వరగా పూర్తి చేయాలి



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: నాలా పనులు త్వరగా పూర్తి చేయాలని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ పేర్కొన్నారు. డివిజన్‌లోని యాకుత్‌పురా, ఎస్ఆర్టీ కాలనీలో నాలా మరమ్మతులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో స్థానికులకు వరద సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు.

3 నెలల రేషన్ సక్రమంగా అందేలా చర్యలు



పుష్పలత

అబిడ్స్: వర్షాకాలం నేపథ్యంలో 3 నెలల రేషన్ సరుకుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని నాలుగో సర్కిల్ అసిస్టెంట్ సప్లై అధికారి పుష్పలత తెలిపారు. జూన్, జులై, ఆగస్టుకు సంబంధించిన రేషన్ సరుకులను రేషన్ దుకాణా లకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని, ఎలాంటి అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు. జూన్ 1న ప్రారంభించి 30 వరకు సరుకులు అందిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి



వేడుకల్లో పురుషోత్తమ్‌రావు, సురేందర్ సింగ్ తదితరులు

అబిడ్స్: బేగంబజార్‌లో మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు మహారాణా ప్రతాప్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేందర్ సింగ్, సుధీర్ సింగ్, సచిన్ సింగ్, నందకిశోర్ సింగ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఎడారిలో వాన చినుకు' నాటకం ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజనీ ఆధ్వర్యంలో రంగ స్థల దర్శకుడు సీహెచ్ మహేశ్ దర్శకత్వంలో 'ఎడారిలో వానచినుకు' అనే నాటకాన్ని రవీంద్రభారతిలో గురువారం ప్రదర్శించారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలేయడం, అమెరికా నుంచి వచ్చిన వ్యక్తికి రూ.25 లక్షలకు తల్లిదండ్రులను అమ్మేందుకు బేరం పెట్టడం అనే అంశాలపై సాగిన నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కొడుకు తీరుపై ఆగ్రహించిన తల్లిదండ్రులు వ్యవహరించిన తీరు ఆహుతులను భాగోద్వేగానికి గురిచేసింది. కార్యక్రమంలో రచయిత శారద ప్రసన్న, సాయి కార్తీకేయ క్రియేషన్స్ సభ్యులు, రసరంజనీ బృందం సభ్యులు పాల్గొన్నారు.





శ్మశానవాటికలో మట్టికుప్పలు



పిచ్చిమొక్కలు, వ్యర్థాలు

ఆఖరి మజిలీకి అవస్థలే..!

- షేక్‌పేట్ హిందూ శ్మశానవాటికలో సౌకర్యాలు నిల్
- 18 బస్తీలకు ఒకే ఒక్క వైకుంఠధామం
- ఇబ్బందుల్లో బస్తీవాసులు
- పట్టని అధికారులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని అంబేడ్కర్‌నగర్ హిందూ శ్మశానవాటికలో సమస్యలు తిష్ట వేశాయి. ఓ వైపు పరిసరాల అస్తవ్యస్తంగా ఉండగా.. మరో వైపు కనీస సౌకర్యాలు లేక అఖరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు. 18 బస్తీలకు ఒకే ఒక్క శ్మశానవాటిక అయినప్పటికీ అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్దియా వారికి ఏటా శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వినతిపత్రాలు ఇస్తున్నా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎవరైనా చనిపోతే ఆ కుటుంబంలోని వారు దహన సంస్కరణాలు చేయాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. ముందుగా శ్మశానవాటిక ప్రహరీ ఎదుట ఉన్న మట్టి, వ్యర్థాలను తొలగించి శ్మశానవాటికలోని వెళ్లాల్సి వస్తోంది. శ్మశానవాటిక లోపల పేరుకుపోయిన వ్యర్థాలతో గుట్టలను తలపిస్తున్నాయి. కనీసం బోర్డు, గేటు కూడా లేదని మండిపడుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం..



శ్మశానవాటికలో ఏ మాత్రం సౌకర్యాలు లేవు. దీంతో బస్తీల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మృతదేహాన్ని వైకుంఠధామంలోకి తీసుకెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో అధికారులను విన్నవించినా అభివృద్ధికి నయా పైసా కేటాయించలేదు. శ్మశానవాటికకు గేట్‌తో పాటు లోపల గది, దహన వేదికను ఏర్పాటు చేయాలి.

– బాల్‌రాజ్‌ముదిరాజ్, అంబేద్కర్‌నగర్

కనీస సౌకర్యాలు కరువు..

శ్మశానవాటికలో బోరు కూడా లేకపోవడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడం స్నానాలు చేసేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గది కూడా లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన వారు రోడ్డుపైనే నిలపడాల్సి వస్తోంది. శ్మశానవాటికకు ప్రహరీ లేకపోవడంతో చీకటి పడితే చాలు గుర్తు తెలియని వ్యక్తులు చెత్తాచెదారం పడేయడంతో పాటు పోకిరీల బెడద కూడా ఉంటోంది. షేక్‌పేట్‌లోని 18 బస్తీల వారికి ఎకరంన్నర స్థలంలో ఉన్న శ్మశానవాటిక ఇది. కనీసం మృతదేహాన్ని దహనం చేసేందుకు దహన వాటిక కూడా లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతులు కల్పించడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని బస్తీవాసులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న మల్లేశ్ ముదిరాజ్, ఏసీపీ మునావర్

అబిడ్స్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సులభం అవుతుందని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ ముదిరాజ్ పేర్కొన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డులో రూ.17.50 లక్షల వ్యయంతో 92 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మునావర్, గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎల్.శ్రీనివాస్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సుకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఏసీపీ మునావర్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలు, దోపిడీలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, మహేశ్, శ్వేత, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మదన్‌మోహన్‌ను సత్కరిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: విద్యాశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీఓస్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యాలయ సంచాలకుడు మదన్‌మోహన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అలాగే విద్యాశాఖ ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ బీఎస్సీ యూనిట్ అధ్యక్షుడు ఫణిరాజు, టీఎన్జీఓస్ హైదరాబాద్ సిటీ యూనిట్ జాయింట్ సెక్రెటరీ సత్యమూర్తి, స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం కార్యదర్శి ఎండీ ఫక్రుద్దీన్, అసోసియేట్ ప్రెసిడెంట్ దేవేందర్, ఉపాధ్యక్షుడు ఎం.భాస్కర్, ఆర్.అశోక్, కోశాధికారి పవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బోనాల విజయవంతానికి సహకరించాలి



సభ్యులతో టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ బి.సైదులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు విజయవంతం చేసేందుకు అందరి సహకారం అవసరమని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ కోరారు. గోల్కొండలోని తన కార్యాలయంలో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ, గోల్కొండ పీస్ కమిటీ సభ్యులతో గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట బోనాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని పోలీసులు, పీస్ కమిటీలు కలిసికట్టుగా పని చేస్తేనే స్థానికులు కూడా తమ సహాయ సహకారాలు అందిస్తారన్నారు. సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు మౌజం మాట్లాడుతూ.. తాము సమాజ సేవా కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద పేషంట్లకు ఉచిత భోజనం, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఐ రాజేంద్రప్రసాద్, ఎస్.రాజువస్తాద్, కౌసరుద్దీన్, ఇలియాస్ ఆలీ, షకీల్ ఆలీఖాన్, ఆబిద్, ఆజామ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, మహమ్మద్ ఇలియాస్ బుఖారి

చార్మినార్: పాకిస్తాన్ వైఖరీని ఎండగట్టిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీరు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ మేరకు మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహమ్మద్ ఇలియాస్ బుకారి ఆధ్వర్యంలో పాతబస్తీ మదీనా సర్కిల్‌లో అసదుద్దీన్ ఓవైసీ చిత్రపటానికి గురువారం సాయంత్రం పాలాభిషేకం చేశారు. చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, కార్పొరేటర్ మహమూద్ క్వాద్రీ, మహమ్మద్ ఇలియాస్ బుఖారీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాకిస్తాన్ వ్యవరించిన దుందుడుకు చర్యలకు ఓవైసీ దీటుగా జవాబిచ్చారన్నారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి



వేడుకల్లో స్థానికులు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్ హనుమాన్ బాలాజీ మందిరంలో రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహా హారతి చేపట్టారు. పొదుపు సంఘాల సభ్యులకు అహల్యాబాయి జీవిత చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడిని సన్మానించారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి అన్నపురం రవి, రాష్ట్ర దళిత మోర్చా అధ్యక్షుడు అంబేద్కర్, నాంపల్లి నియోజకవర్గ కో కన్వీనర్ దాస శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు సి.ముఖేష్, సుజాత, సెంట్రల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఐలయ్య, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, చంద్రకళ, సామల సంతోష్, రమేశ్ కుమార్, స్వప్న రెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

చార్మినార్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మహిళా భద్రతా విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ లావణ్య నాయక్ పేర్కొన్నారు. పాతబస్తీలోని డాన్ హైస్కూల్‌లో మలక్‌పేట్, పురానీహవేలీ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు ఎస్ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించగా వారికి గురువారం జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడితేనే అనుకున్నది సాధించవచ్చన్నారు. విద్యావేత్త హబీబ్ సల్మానీ మాట్లాడుతూ.. డాక్టర్ లావణ్య పోలీసు అధికారిగా చాలా మంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపించారన్నారు. విద్యావేత్త ముహమ్మద్ అబ్దుల్ వాజిద్ ఫత్తాహ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. డాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహమాన్ ఖుర్రమ్ మాట్లాడుతూ పిల్లల కోసం సమయం కేటాయించి, వారిని ప్రేరేపించి, ప్రోత్సహించినందుకు డాక్టర్ లావణ్యకు కృతజ్ఞతలు తెలిపారు. డాన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆరిఫా, షజియుల్లా ఫిరాసత్, డాక్టర్ సుశేన్, ఇర్ఫాన్ ఖురేషి పాల్గొన్నారు.

మెహిదీపట్నం నుంచి బెంగళూర్‌కు ఏసీ బస్సు

గోల్కొండ: మెహిదీపట్నం పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం మెహిదీపట్నం పిల్లర్ నంబర్ 60 నుంచి బెంగళూర్‌కు ఏసీ బస్సు నడపనున్నట్లు మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్-1 డిపోకు చెందిన లహరీ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సు మియాపూర్ నుంచి కేపీహెచ్‌బీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్ మీదుగా మెహిదీపట్నం పిల్లర్ నంబర్ 60 వద్దకు చేరుకుంటుందని పేర్కొన్నారు. రాత్రి 8.30కు ఇక్కడి నుంచి బయలుదేరి శంషాబాద్ మీదుగా బెంగళూరులోని మార్తిహాలీ వరకు వెళ్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నాంపల్లి: గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లెపల్లికి చెందిన చిరు వ్యాపారి మహ్మద్ ఐజాజ్ ఖాన్ (58) ఏక్ మినార్ మసీదు వద్ద బుధవారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయలు కాగా వెంటనే చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



సంతోష్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి బస్టాపు వద్ద 50–55 ఏళ్ల మధ్య నున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు ముస్లిం మతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

భక్త రామదాస్ కీర్తనలు ఎంతో మధురం



కీర్తనలు ఆలపిస్తున్న సంగీత సిస్టర్స్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ కోదండపాణి సంగీత విద్యా సంస్థ ఆధ్వర్యంలో అంతా రామమయం– 2025 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త రామదాస్ కీర్తనలు, తెలంగాణ వాగ్గేయకారుల కీర్తనల ప్రచార యజ్ఞంలో భాగంగా గాయనీ గాయకులు కీర్తనలు ఆలపించారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. శాస్త్రీయ కళలు మన ప్రాచీన వారసత్వ సంపద అని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత సంగీత గురువులపై ఉందన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ నటి అశ్రిత, సంగీత సిస్టర్స్, జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి

నాంపల్లి: 'వందే భారత్ సేవ్ ఇండియా' సినిమాలో జాతీయ ఉత్తమ గీత రచయితగా అవార్డు పొందిన సుద్దాల అశోక్ తేజ రాసిన జైజైజై భారత్ జెండా పాటకు నృత్య ప్రక్రియలో నర్తించిన వారికి నగదు బహుమతి ప్రదానం చేస్తామని చిత్ర నిర్మాత దర్శకుడు మల్లం రమేశ్ పేర్కొన్నారు. నృత్యం ఏ ప్రక్రియ లోనైనా వీడియో చేసి వాట్సప్ 9866140088కు జూలైలోగా పంపాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి మాసబ్ ట్యాంక్‌లోని తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. పహల్గాం ఘటన తర్వాత భారత్-పాక్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పాట అందరికీ చేరాలనే ఉద్దేశంతో వినూత్న ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ, సామాజిక కళాకారులు రామడుగు వసంత్, అరుణ, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, మైపాడు రాజా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 14 రకాల ధాన్యాలకు మద్దతు ధర ప్రకటించడంపై బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాణిక్ ప్రభు ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ..వరి, జొన్న, పత్తి ఎక్కువగా పండే మన రాష్ట్రంలో వేలాది మంది రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణగుప్తా, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, సునీల్‌బోలే, ఆకుల శ్రీకాంత్, వెంకటేశ్ సాగర్ తదితరులు ఉన్నారు.

జూన్ 1 నుంచి రేషన్ బియ్యం పంపిణీ



రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఏసీఎస్ఓ సురేందర్

యాకుత్‌పురా: వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి ముందస్తుగానే 3 నెలల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ సర్కిల్-2 యాకుత్‌పురా ఏసీఎస్ఓ మోకా సురేందర్ తెలిపారు. పురానీ హవేలీలోని సర్కిల్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం, గోధుమలు, చక్కర పంపిణీ చేయనున్నామన్నారు. నూతన రేషన్ కార్డుల కోసం 39,682 దరఖాస్తులు రాగా 4120 అర్జీలు పరిశీలించామన్నారు. రేషన్ పంపిణీకి తమ సర్కిల్‌కి 6,775,917 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం అందించనుందన్నారు. ఈనెల 20లోగా నమోదైన అదనపు కుటుంబసభ్యులకు సంబంధించిన కోటాను సైతం పంపిణీ చేస్తామని చెప్పారు. రేషన్ డీలర్లు జూన్ 1 నుంచి 30 వరకు పంపిణీ చేయాలని ఆదేశించారు.

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



కమిటీ చైర్మన్ కె.చంటిబాబును సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు అన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ తన కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల పాటిస్తూ బోనాలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి జరిగే తొమ్మిది పూజలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని వారికి ఇబ్బందుల్లేకుండా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తామన్నారు. లంగర్‌హౌస్ నుంచి మొదటి బోనం ఊరేగింపు ప్రారంభమవుతుందని రాష్ట్ర మంత్రులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండ కోట వరకు జరిగే ఊరేగింపు రాష్ట్ర సాంస్కృతిక శాఖ వారి రథాలు, పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.చంద్రశేఖర్, సభ్యులు ముంగి రఘుపాల్‌రెడ్డి, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు నాగలపల్లి శ్రీకాంత్, సంతోష్‌గౌడ్, అనిత, ప్రదీప్‌కుమార్, ఎస్.జోగి యాదగిరి తదితరులు ఉన్నారు.

'అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి'

చాంద్రాయణగుట్ట: జీహెచ్ఎంసీలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ఫూల్‌బాగ్ చమాన్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. జీహెచ్ఎంసీలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. అలాగే కాంట్రాక్టర్లతో కుమ్మక్కైన అధికారులను సస్పెండ్ చేసి కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి ప్రజా ధనాన్ని దోచుకున్న వారి నుంచి రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎండ్ల పండరీనాథ్, కార్పొరేటర్లు శ్వేత, ఆలె భాగ్యలక్ష్మి, అరుణ, కొడి మహేందర్, జమాల్‌పూర్ శేఖర్, వీరేందర్ బాబు, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273